క్లుప్తంగా

నేడు శోభకృత్ నామ సంవత్సర పంచాంగ శ్రవణం

భానుపురి : ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం సాయంత్రం 4:30గంటలకు జిల్లాకేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ పంచాంగ శ్రవణానికి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భగత్‌సింగ్ వర్ధంతిని వాడవాడలా నిర్వహించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవైఎల్ నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని వాడవాడలా నిర్వహించాలని పీవైఎల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పిడమర్తి సురేష్, కలంచర్ల శ్రీను అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దోపిడీ, అసమానతలు లేని సమాజం కోసం చేస్తున్న పోరాటంలో వారిని ఉరి తీసి 92 ఏళ్లు అవుతుందని తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకొని యువత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపెన్‌పహాడ్ ఉపసర్పంచ్ కలంచర్ల చంద్రయ్య, శ్రీను, రమేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

డక్కలి కుటుంబాలను ఆదుకోవాలని వినతి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : మునగాల మండల కేంద్రంలో నివసిస్తున్న డక్కలి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కన్వీనర్ కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. కులవివక్షకు గురవుతున్న డక్కలి కుటుంబాలతో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. మునగాల మండల కేంద్రంలో నిలువ నీడలేని డక్కలి కులస్తులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని, లేనిచో ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా రేషన్ కార్డులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర అఖిల్‌కుమార్, భూక్యా రాంజీ, యేశోబు, సావిత్రి, మంగమ్మ, రాణి పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం

పెన్‌పహాడ్ : కార్పొరేట్ శక్తులకు కార్మికుల శ్రమను దోచిపెట్టే కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించడమే కార్మికుల లక్ష్యమని సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ అన్నారు. మంగళవారం లింగాల గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను మార్చుకోవాలన్నారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే మజ్దూర్ కిసాన్ సంఘర్షణ ర్యాలీకి కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, జానీ, పుల్లయ్య, రాములు, జార్జి, సైదులు, సీమోను, విద్యాసాగర్, కృష్ణయ్య, రమేష్, లచ్చయ్య పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

పెన్‌పహాడ్ : గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ నెమ్మాది భిక్షం వైద్యసిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జనారోగ్య సమితి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో స్వచ్ఛత, పరిశుభ్రత, జీవనశైలి, వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని తగిన పరిష్కారాలు సూచించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీఓ శ్రీనివాస్, వైద్యాధికారి స్రవంతి, సర్పంచ్‌లు నూనావత్ బోడి, శాలిబాయి, ఎంపీటీసీ ఊరుకొండ జానకమ్మ, ఏపీఓ రవి, ఎంఈఓ నకిరేకంటి రవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, ఏపీఎం అజయ్, వైద్యాధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం

రోగుల చెంతకు మందులు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల కోసం..
- సబ్ సెంటర్లలో ప్రతి నెలా పంపిణీ చేయనున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : అసంక్రమిక వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వం అన్ని ఆసుపత్రులకు మందుల కిట్లను పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లా నుంచి మండలాలకు మందుల కిట్లు రాగా అక్కడి నుంచి అన్ని సబ్‌సెంటర్లకు పంపిణీ చేశారు. ఈ కిట్లను రోగులకు ప్రతి నెలా సబ్‌సెంటర్ల పరిధిలో పంపిణీ చేయాల్సి ఉంటుంది. బీపీ, మధుమేహం(షుగర్) వ్యాధులకు క్రమం తప్పకుండా చికిత్స చేసుకుంటున్న వారికి ప్రభుత్వం వీటిని ఉచితంగా అందిస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో పేర్లు నమోదు చేసుకొని అక్కడి నుంచి ప్రతినెలా ప్రభుత్వం అందించే మందులు వినియోగిస్తున్న వారికి ఈకిట్లను పంపిణీ చేయనున్నారు.

మండల వ్యాప్తంగా 1,966మంది వ్యాధిగ్రస్తులు..

జాజిరెడ్డిగూడెం మండలంలో 1,197 మంది బీపీ వ్యాధిగ్రస్తులు, 769మంది మధుమేహం వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఇంకా అనేక మంది ఉన్నప్పటికీ వారు ప్రైవేట్‌గా మందులు వాడుతున్నారు. కాగా ఈ షుగర్, బీపీ జబ్బులతో బాధపడేవారికి ఇక నుంచి ప్రతినెలా మందుల కిట్ పంపిణీ చేయనున్నారు. ఇందులో నెలకు సరిపడే 30 మాత్రలు ఉండనున్నాయి. షుగర్ ఉన్నవారికి 30, బీపీ ఉన్నవారికి 30 చొప్పున నెలకు సరిపడే మాత్రలను ఇవ్వనున్నారు. దీనికి సంబంధించి అన్ని సబ్‌సెంటర్లకు కిట్లను రెండు రోజులుగా పంపిణీ చేస్తున్నారు. త్వరలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి ఈ కిట్లను అందజేయనున్నారు. ప్రతి రోజు రోగి వ్యాధి తీవ్రతను బట్టి మందులను వాడాల్సి ఉంటుంది.



కాసర్లపహాడ్‌లో కిట్ పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

కిట్లను పంపిణీ చేయడం సంతోషకరం



నేను షుగర్, బీపీతో ఇబ్బంది పడుతున్నాను. అయితే ప్రతినెలా రెండింటికి కలిపి కిట్ ద్వారా మందులు ఇస్తామని చెప్పారు. ప్రైవేట్‌గా మందులు కొనాలంటే ఇబ్బంది అవుతుంది. ప్రభుత్వం కిట్లు ఇవ్వడం సంతోషకరం

– వేముల సత్తయ్య, కాసర్లపహాడ్

ఇంటింటికీ పంపిణీ చేస్తాం



బీపీ, షుగర్ వ్యాధులకు మందుల కిట్లు వచ్చేశాయ్. జిల్లా నుంచి వచ్చిన కిట్లను సబ్‌సెంటర్ల వారీగా పంపిణీ చేశాం. త్వరలో వైద్యసిబ్బంది రోగుల ఇళ్లకు వెళ్లి అందజేస్తారు. నెలకు సరిపడా మందులను పంపిణీ చేయనున్నాం.

– ఎల్.చరణ్, మండల సామాజిక ఆరోగ్య అధికారి

ముందస్తుగా ఉగాది వేడుకలు



సూర్యాపేట : ఉగాది వేడుకలు జరుపుకుంటున్న వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది

సూర్యాపేట : శ్రీశోభకృతనామ సంవత్సర ఉగాది వేడుకలను మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయంలో సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ హర్షవర్ధన్, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.



నూతనకల్‌లో ఉపాధ్యాయులకు కంకణాలు కడుతున్న విద్యార్థులు

నూతనకల్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఉగాది ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహించాలి

తుంగతుర్తి : ప్రభుత్వం చేపట్టే ఉపాధి హామీ పనులను పారదర్శంగా నిర్వహించాలని డీఆర్‌డీఓ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి ఉపాధిహామీ ఓపెన్ ఫోరంలో పాల్గొని మాట్లాడారు. వారం రోజుల నుంచి గ్రామాల్లో నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో గుర్తించిన సమస్యలను సభ దృష్టికి తీసుకరాగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడినా, పనులపట్ల అలసత్వం వహించినా సంబంధిత సిబ్బందికి మెమోలు జారీ చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. వేసవిలో ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ ఎస్.లచ్చిరాంనాయక్, హెచ్ఆర్ మేనేజర్ ప్రవీన్‌కుమార్, ఎంపీడీఓ భీంసింగ్, అజయ్‌కుమార్, రమేష్, ఎంపీపీ గుండగాని కవిత రాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, సర్పంచ్‌లు నల్లు రామచంద్రారెడ్డి, యాకూబ్ నాయక్, గుజ్జ పూలమ్మ, ఏపీఓలు కృష్ణయ్య, వెంకన్న, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

రోడ్ల విస్తరణ పనుల పరిశీలన



రోడ్ల విస్తరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

సూర్యాపేట : పట్టణంలో రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ యస్.వెంకట్రావ్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్ల విస్తరణ పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పట్టణంలో ఎంజీ రోడ్డు తరహాలో అన్ని రోడ్లలో గ్రీనరీ మరింత పెంచాలని.. అలాగే ప్రజా రవాణా వ్యవస్థకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

అర్వపల్లి : కొమ్మాలలో ఈ నెల 27 నుంచి రెండు రోజులపాటు జరిగే అభయాంజనేయస్వామి ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు మంగళవారం హైదరాబాద్‌లో ఆలయ నిర్మాణ దాత గోళ్ల రమేష్ ఆహ్వానపత్రాన్ని అందజేశారు. రెండు రోజుల పాటు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు రూ.35లక్షల వ్యయంతో స్వచ్ఛందంగా ఆలయాన్ని నిర్మించినట్లు దాత రమేష్–మమత దంపతులు చెప్పారు.

ప్రపంచ జల దినోత్సవంపై అవగాహన సదస్సు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వీవై సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఆర్.నాగరాణి మాట్లాడారు. విద్యార్థులకు నీటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రపంచ జల దినోత్సవం జరుపుకోవడానికి ప్రధాన కారణాలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి వంగాల రవీందర్, రావుల వీరబాబు, బద్దం భార్గవ్, పద్మశ్రీ, మాధవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమ పథకాలు



సింగారెడ్డిపాలెంలో పాదయాత్ర చేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, తదితరులు

పెన్‌పహాడ్ : దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనలోనే ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జానారెడ్డినగర్, సింగారెడ్డిపాలెం, అనంతారం గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ మహాపాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో సాగు, తాగునీటి కోసం భారీ ప్రాజెక్టులను నిర్మించి వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధిపర్చిన ఘనత కాంగ్రెస్‌దేని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చి ప్రజలకు చేసింది ఏమిలేదని ఆయన విమర్శించారు. సూర్యాపేట నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు రాజీలేని పోరాటం చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బచ్చుపల్లి నాగేశ్వర్‌రావు, ఎంపీటీసీలు కొండేటి పవన్, గద్దల నాగరాజు, ముదిరెడ్డి రమణారెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, సైదిరెడ్డి, స్వామినాయుడు, ఫరూక్, సామ సురేందర్‌రెడ్డి, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంపద దోచుకుంటూ పాలన

పెన్‌పహాడ్ : తెలంగాణ రాష్ట్ర సంపద మొత్తాన్ని కేసీఆర్ కుటుంబం దోచుకుంటుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం చీదెళ్ల, దూపహాడ్ గ్రామాల్లో ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి మోసం చేసిన కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగులు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ రాష్ట్రానికి ఇళ్లు కేటాయించినా రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు కట్టించడం లేదన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఉపసర్పంచ్ కొండ సైదమ్మ కుమారుడు కొండ సందీప్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకల రాములు, పోకల వెంకటేశ్వర్లు, చెన్ను రమణారెడ్డి, సలిగంటి వీరేంద్ర, నరహరి, శ్రీనివాస్‌రెడ్డి, వెన్న సైదిరెడ్డి, వెంకన్న, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్‌లో చేరి కేంద్ర ప్రభుత్వం ద్వారా 5 లక్షల రూపాయల వరకు ఉచిత ఆరోగ్య బీమా పొందవచ్చునని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం కందగట్ల, రామన్నగూడెం గ్రామాల్లో నిర్వహించిన ఆయుష్మాన్ భారత్ ప్రత్యేక శిబిరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో మధ్య తరగతి ప్రజలు ఆయుష్మాన్ భారత్‌కు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనకు, ప్రధానమంత్రి ఉజ్వల యోజనకు అర్హులు కాలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎండీ అస్లాం, దండ వెంకటరెడ్డి, మన్మధరెడ్డి, గోగుల వెంకటరెడ్డి, తూడి సారయ్య, రాజయ్య, బైరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



దూపహాడ్‌లో ఆయుష్మాన్ భారత్ నమోదులో పాల్గొన్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

కంటి వెలుగుతో పేదల జీవితాల్లో వెలుగులు

సూర్యాపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 21, 34, 19 వార్డుల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అంధత్వ రహిత తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి, వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, కౌన్సిలర్ పోలగాని కవిత, బాలుగౌడ్, మేడిపల్లి విక్రమ్, సుంకరి అరుణ, రమేష్, ఉపేందర్, తాహిర్, యాదగిరి పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ బీరవోలు రవీందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జాటోత్ తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాటోత్ హేమలత, ఎంపీటీసీ మామిడి కిరణ్ కుమార్, ఉప సర్పంచ్ ధరావత్ సుక్కమ్మ, వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, క్యాంపు మెడికల్ అధికారి డాక్టర్ విజయ, సూపర్‌వైజర్లు సబిత, స్వరూప, కార్యదర్శి సతీష్, ఏఎన్‌ఎంలు స్వరూప, జ్యోతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



తుంగతుర్తి : రామన్నగూడెంలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ డైరెక్టర్

తుంగతుర్తి : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. మంగళవారం రామన్నగూడెంలో రెండో విడత కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు శిబిరంలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు కాంతమ్మ, ఎంపీటీసీ ఆంగోతు నరేష్, డాక్టర్లు నాగునాయక్, ఉదయప్రణవి, నబీపాష, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములుగౌడ్, దీప్లా, వైద్యసిబ్బంది యాదగిరి, రాములు, వీరు, సైదమ్మ, సూరి, సోమన్న, వార్డు సభ్యులు, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

నూతనకల్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల పరిధిలోని వెంకేపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాతంగి సోమనర్సమ్మ, తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్, ఎంపీడీఓ ఇందిర, ఉప సర్పంచ్ సైరెడ్డి సుధీర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ కార్యదర్శి బాణాల మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



నూతనకల్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

అర్వపల్లి : 18 ఏళ్లు పైబడి కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంటి వెలుగు వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం తెలిపారు. మంగళవారం కోడూరులో గ్రామస్తులకు కంటి వెలుగు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఇప్పటి వరకు 840 మందికి పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎల్. చరణ్, సిబ్బంది కె. వీరయ్య, ఎ. వేణు, కరుణ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన



తొండలో దెబ్బతిన్న నిమ్మతోటను పరిశీలిస్తున్న ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత

తిరుమలగిరి : ఇటీవల కురిసిన వడగండ్ల వానల వల్ల దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత అన్నారు. మంగళవారం తొండ గ్రామంలో దెబ్బతిన్న పంటలను, నిమ్మ తోటలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వడగండ్ల వర్షం కురియడంతో వరి, మామిడి, నిమ్మ, ఇతర పంటలు దెబ్బ తిన్నాయని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి జిల్లా అధికారులకు వివరాలు తెలియజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రైతు బంధు కన్వీనర్ మూల అశోక్‌రెడ్డి, సర్పంచ్ నెమురుగొమ్ముల శాతవాహనరావు, గోపాల్‌రెడ్డి, ఏఈఓ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

వడగండ్ల వానతో కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య కోరారు. మంగళవారం తొండ, వెలిశాల, జలాల్‌పురం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పంటల వివరాలు సేకరించి దెబ్బతిన్న పంటలకు ఆర్థికసాయం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు వై.ధీన్‌దయాళ్, ఎం.యాదగిరి, మండల శాఖ అధ్యక్షుడు బంగారి, వెంకటేశ్వర్లు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం



నాగారం : ఈటూరులో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా మేనేజర్ హరీష్

పెన్‌పహాడ్ : రైతులు సంప్రదాయ పంటల సాగుకు బదులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చని సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి అన్నారు. మంగళవారం చీదెళ్ల గ్రామంలోని రైతువేదిక కార్యాలయంలో ఆయిల్ పామ్ పంటసాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. కృష్ణసందీప్, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ రైతు విభాగం మండల అధ్యక్షుడు గుర్రం అమృతారెడ్డి, ఏఈఓ మనోజ్, వెన్న అంజిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్: మాట్లాడుతున్న సర్పంచ్ సీతారాంరెడ్డి

ఈటూరులో..

నాగారం : రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ పంటను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని ఆయిల్‌పామ్ కంపెనీ జిల్లా మేనేజర్ జె.హరీష్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్‌పామ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేరాల సరితయాదగిరి, ఉపసర్పంచ్ రాంపల్లి సోమన్న, ఏఈఓ రమ్యతేజ, ఆయిల్‌పామ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ రంగు ముత్యంరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

తుంగతుర్తి : మండల పరిధిలోని అన్నారం జెడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం శారద సేవా నిధి ట్రస్ట్ సభ్యులు ఉచితంగా పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గురువయ్య మాట్లాడారు. టెన్త్ విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శారద నిధి ట్రస్ట్ అధ్యక్షుడు అక్కెనపల్లి శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు రెడ్డబోయిన నాగరాజు, బాలే కమలాకర్, మధు, ఉపాధ్యాయులు లక్ష్మణ్, నరేందర్, దేవేందర్, పద్మ, రేణుక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

సంక్షిప్తంగా..

ప్రజాస్వామ్య పరిరక్షణకే జనచైతన్య యాత్ర

నూతనకల్ : మతోన్మాద బీజేపీ పాలనలో కనుమరుగవుతున్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసమే సీపీఎం ఆధ్వర్యంలో జనచైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని తొట్ల మల్సూర్ స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జన చైతన్య యాత్ర ఈ నెల 25, 26తేదీల్లో జిల్లాకు రానున్న సందర్భంగా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బత్తుల జనార్దన్, ఎర్ర ఉప్పల్‌రెడ్డి, కూసు బాలకృష్ణ, దాసరి రవి, సామ దామోదర్‌రెడ్డి, తొట్ల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన

ఆత్మకూర్ (ఎస్) : విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని తహసీల్దార్ పుష్ప అన్నారు. మంగళవారం నెమ్మికల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రంలో విద్యార్థుల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకూడదని, కష్టపడి చదవాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సూర్యాపేటక్రైం : ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ రాజశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎస్ఐ నరేష్‌తో కలిసి ట్రాఫిక్ నిబంధనలపై పలువురికి అవగాహన కల్పించారు. ఆయన వెంట ట్రాఫిక్ పోలీసులు మల్లేష్, రవీందర్, సంతోష్, జానకిరాములు, తదితరులు ఉన్నారు.

న్యూట్రిషన్ కిట్ల అందజేత

పెన్‌పహాడ్ : ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఆయుష్ న్యూట్రిషన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ నకిరేకంటి రవి, ఆయుష్ డాక్టర్ నేహా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు ఆయుష్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంతో కూడిన రాగి లడ్డులను, ఆయుష్ కర దీపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఆసియా జబీన్, ఫార్మసిస్టు షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరేణుకా ఎల్లమ్మ ఉత్సవాలకు విరాళం

నాగారం : నాగారం మండల కేంద్రంలో జరుగుతున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఉత్సవానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తండ్రి గుంటకండ్ల రామచంద్రారెడ్డి మంగళవారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలన్నారు. అనంతరం శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి పండుగ నిర్వహణ కోసం మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో రూ.20,000 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గుండగాని అంబయ్య, బీఆర్ఎస్ నాయకులు చిప్పలపల్లి సోమయ్య, చిప్పలపల్లి రాములు, మల్లేష్, కూరం వెంకన్న, గద్దల సైదులు, దేవరకొండ మురళి, ఉపేందర్, పరశురాములు, బాలస్వామి, మధు, పండు, శ్రీకాంత్, మహేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేటటౌన్ : ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య సతీమణి చుక్కా లక్ష్మీబాయమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన చుక్కా లక్ష్మీబాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లా కేంద్రంలోని జయ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారు. అన్ని తరగతుల్లో 1, 4, 5, 6, 8 ర్యాంకులతో పాటు 50 లోపు 104 ర్యాంకులు, 100 లోపు 195 మంది ర్యాంకులు సాధించినట్లు కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతిలు అభినందించారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : ఈ నెల 23న గరిడేపల్లి మండల కేంద్రంలో జరుగు ఐఎఫ్‌టీయూ 5వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కుసుకుంట్ల సైదులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నర్సమ్మ, పద్మ, సరోజ, సృజన, వెంకటమ్మ, మణెమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

దండుమైసమ్మ ఆలయ అర్చకుడికి సన్మానం

ఆత్మకూర్ (ఎస్) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఉగాది పురస్కార అవార్డుల ప్రదానోత్సవంలో నెమ్మికల్లు గ్రామానికి చెందిన దండుమైసమ్మ దేవాలయ అర్చకుడు అబ్బోజు సతీష్ కుమార్ సన్మానం పొందారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్యయాదవ్, అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస శ్రీరామ్‌రెడ్డి తదితరులు ఆయనను సన్మానించారు.

అప్పారి వెంకటస్వామి వర్ధంతి

సూర్యాపేటటౌన్ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి 22వ వర్ధంతిని మంగళవారం స్థానిక టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు, సంఘం నాయకులు ఎస్.అనిల్‌కుమార్, కె.అరుణభారతి, వెంకటయ్య, యాకయ్య, ఎస్‌కె.సయ్యద్, వీరారెడ్డి, పాపిరెడ్డి, ఆడం, లాలు, శ్రీనివాసాచారి, సైదా పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాతా

అర్వపల్లి : ప్రభుత్వ సంక్షేమ పథకాలను, కంటి వెలుగు కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరుతూ మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు వేల్పుచర్ల గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఖమ్మంపాటి కరుణాకర్, సారథి జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు, కళాకారులు వెన్నెల నాగరాజు, ఉదయ్, శ్రీకాంత్, రాములు, ఉపేందర్, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.